ప్రజాశక్తి

బుధవారం 25 అక్టోబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఒంగోలులో భారీ అగ్నిప్రమాదం

- ప్లాస్టిక్ గోడౌన్‌లో చెలరేగుతున్న మంటలు
- రాత్రి 9 గంటలకూ అదుపులోకి రాని పరిస్థితి
- సుమారు రూ.కోటి ఆస్తి నష్టం
- షార్ట్‌సర్క్యూట్ జరగలేదు: ఎస్ఇ



గోడౌన్‌లో చెలరేగుతున్న మంటలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని పప్పుబజార్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఓ ప్లాస్టిక్ గోడౌన్‌లో తెల్లవారుజామున మూడు గంటలకు చెలరేగిన మంటలు రాత్రి తొమ్మిది గంటల వరకు అదుపులోకి రాలేదు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు కోటి రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. పప్పుబజార్‌లో జరిగిన అగ్ని ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణం కాదని, బాణసంచా కాల్చినప్పుడు వచ్చిన నిప్పురవ్వల తో జరిగి ఉండవచ్చని ఎపిసిపిడిసిఎల్ ఎస్ఇ కెవిజి సత్యనారాయణ తెలియజేశారు. గోడౌన్ యజమానిని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పరామర్శించారు. ఏ కారణంతో అగ్ని ప్రమాదం జరిగిందనే కోణంలో అగ్నిమాపక, పోలీసు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిమాపక అధికారుల సమాచారం ప్రకారం.. కొమ్మిశెట్టి సునీల్‌కి చెందిన సునీల్ కాయర్ రోప్ మర్చంట్స్ పేర ప్లాస్టిక్ వస్తువులు అమ్మే హోల్‌సేల్ గోడౌన్ ఒంగోలు పప్పు బజార్‌లో ఓ భవనంలోని మూడో అంతస్తులో ఉంది. ఇందులో ప్లాస్టిక్ వాన పట్టలు, నవ్వార్లు, ప్లాస్టిక్ తాళ్ళు, డోర్ మ్యాట్‌లు వంటి ఉంటాయి. మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో గోడౌన్‌లో మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వటంతో ఒంగోలు అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలికి చేరుకొని మంటలు ఆర్పేందుకు చర్యలు చేపట్టారు. గోడౌన్‌లో ప్లాస్టిక్ ▶ 2లో

నకిలీ వీలునామాతో

రూ.3 కోట్ల భూమికి ఎసరు

- మార్కెట్‌యార్డు సమీపంలో అక్రమ రిజిస్ట్రేషన్‌తో భూవివాదం
- వీలునామాతో జిపిఎ పొంది.. తర్వాత వేరే సంస్థకు విక్రయం
- తమకు న్యాయం చేయాలని సిట్‌ను ఆశ్రయించిన బాధితులు
- ఈ భూవివాదంలో బాధితుడు డిసిసి మాజీ అధ్యక్షుడు..



అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన భూమి ఇదే..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలులో భూవివాదాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. తమకు న్యాయం చేయాలని సిట్‌ను కలిసే బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. ఇప్పుడు మరో సంచలన భూ వివాదం వెలుగులోకి వచ్చింది. ఈ బాధితుడు డిసిసి మాజీ అధ్యక్షుడు పసుపులేటి మాలకొండయ్యే.. ఇప్పుడు వీరికి చెందిన భూమి 1.20 ఎకరాలు నకిలీ వీలునామాతో వేరే సంస్థకు రిజిస్ట్రేషన్ చేశాడో ఓ ఘనుడు. దీని విలువ సుమారు రూ.3 కోట్లకు పైమాటేనంటున్నారు. ఇప్పుడు బాధితులు సిట్‌ను ఆశ్రయించి.. ఫిర్యాదు చేశారు.

1980లో రిజిస్ట్రేషన్ జరిగిన స్థలం అదీ..

మార్కెట్‌యార్డు సమీపంలో పెట్రోలు బంకు పక్కనే ముక్తినూతలపాడు పరిధిలోని సర్వేనెంబరు 173లో 1980లోనే సూదన గుంట అయ్యన్న కుమారుడు నాగభూషణం నుంచి పసుపులేటి హనుమాయమ్మ 61 సెంట్లు (డాక్యుమెంటు నెం.3170) పసుపులేటి మాలకొండయ్య 61 సెంట్లు (డాక్యుమెంటు నెం.3169) ద్వారా కొనుగోలు చేయగా రిజిస్ట్రేషన్ అయ్యింది. అప్పటి నుంచీ వీరి స్వాధీనంలోనే ఈ భూమి ఉంది.

నకిలీ వీలునామా తెచ్చిన తంటాలు

ఈ భూమికి నకిలీ వీలునామా తెచ్చి వివాదంలోకి నెట్టారని బాధితులు చెబుతున్నారు. అదెలాగంటే మార్కాపురానికి చెందిన రెడ్డిపోగు గురవయ్య అనే వ్యక్తి తనకు ఎం.నిడమానూరు గ్రామానికి చెందిన కాకుమాను చినసుబ్బయ్య భార్య వీరమ్మ నుంచి వీలునామా ఉన్నట్లు ▶ 2లో

పోలీసులకు 'ఫారం-7' షాక్

- ఓట్ల అక్రమ తొలగింపు విషయంలో బిఎల్‌ఒలపై ఒత్తిళ్లు..!
- ఒక సిఐ, ముగ్గురు ఎస్ఐల సస్పెన్షన్
- ఇప్పటికే ఫారం-7 దరఖాస్తులను గంపగుత్తగా పంపిన 16 మందిపై కేసులు నమోదు



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా, మార్టూరు రూరల్

పర్చూరు నియోజకవర్గంలో నిబంధన లకు విరుద్ధంగా ఫారం-7 దరఖాస్తుల సమాచారాన్ని పోలీస్ అధికారులు తీసుకోవడమే కాకుండా బిఎల్‌ఓలపై ఓట్ల తొలగింపు కోసం ఒత్తిడి చేశారన్న ఆరోపణల నేపథ్యంలో వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. మార్టూరు సిఐ టి ఫిరోజ్, పర్చూరు ఎస్సై ఎన్‌సి ప్రసాద్, మార్టూరు ఎస్సై కె కమలాకర్, గతంలో యద్దనపూడి ఎస్సైగా పనిచేసిన కె.అనూక్‌ను సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజి ఐజి పాలరాజు ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఫారం-7 దరఖాస్తులను గంపగుత్తగా పంపిన వైసిపికి చెందిన 16 మందిపై కేసులు నమోదు కాగా తాజాగా పోలీస్ అధికారులపై కఠినచర్యలు తీసుకోవడంతో ఓట్ల అక్రమ తొలగింపునకు అధికారపార్టీ నేతలు మూడు నెలలుగా చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొట్టినట్లయింది. పోలీస్ అధికారులను ఏ కారణాలపై సస్పెండ్ చేశారన్న విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారులు బహిరంగంగా వెల్లడించనప్పటికీ ఎన్నికల కమిషన్ పరిధిలో ఉన్న అంశాలపై మితిమీరిన జోక్యం చేసుకున్నారన్న ఆరోపణలపైనే ఈ నలుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

జిల్లాలో గత జులై నుంచి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో పర్చూరులో 40 వేల దొంగ ఓట్లు ఉన్నాయని, గ్రామాలవారీగా ఉన్న దొంగ ఓట్లను తాము గుర్తించామని అధికార వైసిపి నేతలు అప్పట్లో ప్రకటించారు. ఈ మేరకు రానున్న ఎన్నికల్లో గెలవడమే ధ్యేయంగా టిడిపికి చెందిన వారి ఓట్లను తొలగించేం దుకు గ్రామాలలో ఉన్న వైసిపి అనుయాయు లతో గంపగుత్తగా ఫారం-7 దరఖాస్తు లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దొంగ ఓట్ల పేరుతో పర్చూరు జరుగుతున్న అధికార పార్టీ నేతల ఆగడాలను గమనించిన స్థానిక టిడిపి శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఓటర్ల జాబితా తయారీలో నిబంధనలకు అనుగుణంగా అధికారులు పారదర్శకంగా వ్యవహరించా లని ఎన్నికల అధికారులు గతంలోనే హెచ్చరించడం జరిగింది. అయినప్పటికీ పర్చూరులో కొందరు పోలీస్ అధికారులు ఎన్నికల కమిషన్ నియమనిబంధనలను తుంగలో తొక్కారన్న విమర్శలు వెల్లువెత్తాయి.

పర్చూరులో ఓటర్ల జాబితా తయారీలో మహిళా పోలీసులను బిఎల్‌ఓలుగా నియమించారు. వారితో పోలీస్ అధికారులు వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి ఫారం-7 ద్వారా దాఖలైన దరఖాస్తుల విషయమై నేరుగా జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. గ్రామాల్లో వైసిపి చెందిన వారు అక్రమంగా ఫారం-7 దరఖాస్తులు చేయడం, సదరు దరఖాస్తులపై బిఎల్‌ఓలు తీసుకోవల సిన చర్యల గురించి సిఐ, ఎస్ఐ లు బూత్ లెవల్ ఆఫీసర్లుగా ఉన్న వారితో వాట్సప్ చాట్ ద్వారా సంభాషిస్తూ ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడయింది. పోలీస్ అధికారులు బిఎల్‌ఓల తో జరిపిన వాట్సాప్ చాట్‌లను సేకరించిన పర్చూరు టిడిపి శాసనసభ్యులు ▶ 2లో

సమన్వయంతో సమగ్ర దర్యాప్తు

- టెక్నాలజీతో సాక్ష్యాధారాలు గుర్తించాలి
- నిందితులను అరెస్టు చేయాలి
- బాధితులకు న్యాయం జరగాలి
- సిట్ అధికారులకు ఎస్‌పి మలికగర్గ్ ఆదేశం



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నకిలీ పత్రాలు, స్టాంపులు, ఫోర్జరీ కేసు లపై రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలతో సమ న్వయం చేసుకుంటూ సమగ్రంగా దర్యాప్తు చేయాలని జిల్లా ఎస్‌పి మలికగర్గ్ ఆదేశిం చారు. పక్కాగా సాక్ష్యాధారాలను సేకరించి నిం దితులను అరెస్టు చేసి బాధితు లకు న్యాయం చేయాలని సూచించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నకిలీ పత్రాలు, స్టాంప్స్, ఫోర్జరీ కేసులపై సిట్ టీంతో ఎస్‌పి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన నకిలీ డాక్యుమెంట్స్, రబ్బర్ స్టాంప్స్ మరియు ఫోర్జరీకి సంబం ధించిన 16 కేసులపై ప్రత్యేక దర్యాప్తు టీం అధికారులతో ఆయా కేసుల్లో ప్రస్తుత దర్యాప్తు పురోగతి, డాక్యుమెంట్స్ సేకరణ, నిందితుల గుర్తింపు, అరెస్ట్, ఇతర అంశాలపై ఎస్‌పి ఆరా తీశారు. సంబంధిత డాక్యుమెంట్స్, సిడి ఫైల్స్ క్షుణ్ణంగా పలిశీలించి తగిన సలహాలు ఇచ్చారు ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఈ కేసుల్లో ప్రాంతాలు, కారణాలు వారీగా నకిలీ డాక్యుమెంట్స్ గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కేసుకు సంబంధించిన ఆధారాలతో రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ సహకారం, సమన్వయంతో సమగ్రంగా దర్యాప్తు చేయాలన్నారు. ఇళ్ల స్థలాలు, ప్లాట్లు, వ్యవసాయ భూములపై రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్, డికె, డెత్, విసి, ఇతర పత్రాలను సంబంధిత శాఖల ద్వారా పరిశీలన చేసి వాటికి సంబంధించిన వాస్తవ యజమానులు, వారికి సంబంధించిన డాక్యుమెంట్లను గుర్తించాలన్నారు. ఆయా స్థలాలపై నకిలీ పత్రాలు ఎవరు సష్టించారు, కేసులోని నిందితులకు వారితో ఉన్న సంబంధాలను టెక్నాలజీ ద్వారా గుర్తించి పూర్తి సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేసి శిక్షలు పడేలా కషి చేయాలని పోలీస్ అధికారులను ఎస్‌పి ఆదేశించారు. సమావేశంలో ఏఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వర రావు, ఏఎస్‌పి (క్రైమ్) ఎస్.వి. శ్రీధర్ రావు, ఎస్‌బి డిఎస్‌పి బి.మరియాదాసు, ఒంగోలు డిఎస్‌పి నారాయణస్వామి రెడ్డి, దర్శి డిఎస్‌పి అశోక్ వర్ధన్, కనిగిరి డిఎస్‌పి రామరాజు, సిట్ టీం సిఐలు పాల్గొన్నారు.

పోలీసులకు ఫారం-7 షాక్

(మొదటిపేజీ తరువాయి)

ఏలూరు సాంబశివరావు సదరు వాట్సాప్ స్క్రీన్ షాట్లతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పర్చూరు నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా ఫారం-7 దరఖాస్తుల సమాచారాన్ని పోలీస్ అధికారులు తీసుకోవడమే కాకుండా సదరు బిఎల్వోలతో కలిసి అక్రమంగా ఓట్ల తొలగింపునకు సహకరించారని తెలిసింది. ఈ విషయమై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విచారణ జరిపిన కలెక్టర్ మార్టూరు సిఐ, ముగ్గురు ఎస్ఐలకు బిఎల్వోలు ఫారం-7ల సమాచారం పంపినట్లు నివేదిక పంపారు. ఫారం-7 విషయమై సదరు పోలీస్ అధికారులు బిఎల్వోలపై వాట్సాప్ చాట్‌ల ద్వారా ఒత్తిడి తెచ్చినట్టు విచారణలో తేలింది. ఈ అంశం ఎన్నికల కమిషన్‌తో పాటు కోర్టు పరిధిలో కూడా ఉన్న నేపథ్యంలో గుంటూరు రేంజి ఐజి పాలరాజు మూడు రోజుల క్రితం బాపట్ల వచ్చి.. జిల్లా ఎస్‌పి సమక్షంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్టూరు సీఐ, ముగ్గురు ఎస్ఐలను విచారించారు. ఎన్నికల కమిషన్ నిబంధనకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలడంతో రెండు రోజుల క్రితం సదరు పోలీస్ అధికారులను వీఆర్‌కు పంపారు. ఇప్పటికే బిఎల్వోలపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన నేపథ్యంలో వారిపై ఒత్తిడి తెచ్చిన పోలీస్ అధికారులపై తాము కఠినచర్యలు తీసుకోకపోతే ఎన్నికల కమిషన్‌తో పాటు కోర్టులో సమాధానం చెప్పుకోవడం కష్టం అని భావించిన పోలీస్ ఉన్నతాధికారులు వీఆర్ లాంటి చర్యలతో సరిపెట్టకుండా వారిని సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

నకిలీ వీలునామాతో రూ.3 కోట్ల భూమికి ఎసరు..

(మొదటిపేజీ తరువాయి)

నకిలీపత్రాన్ని సృష్టించారు. ఇది 2006లో ఏప్రిల్ 21న రాసినట్లు ఉంది. దీన్ని అడ్డుపెట్టుకొని ఈయన 2009లో కర్రి సోమిరెడ్డి, కొండా బలరామిరెడ్డిలకు పవర్‌ఆఫ్ పట్టాను ఇచ్చారు. వాస్తవానికి వీలునామా రాసినట్లు చూపిన మహిళకూ, ఇతనికీ ఏ బంధుత్వం గానీ, వ్యాపార లావాదేవీలు గానీ లేవు. పైగా ఈ వీలునామా కూడా మదింపులేనిది. అంటే రిజిస్ట్రేషన్ లేనిది. ఇక్కడ ఇంకో విషయమేమిటంటే వీలునామా రాసినట్లు చూపిన మహిళ వీరమ్మ తన భర్తతో విడిపోయి 1970లోనే విడాకులు తీసుకున్నారు. అప్పుడు భరణం కింద లక్ష రూపాయలు సెటిల్‌మెంటు చేశారు. అప్పుడు కోర్టులో ఆమెకు ఈ ఆస్తులున్నట్లు ఎక్కడా చూపలేదని బాధితులు చెబుతున్నారు. వాటి ఆధారాలను కూడా తీసుకొని సిట్‌కు సమర్పించారు. ఆ ఇద్దరికీ ఇచ్చిన పవర్‌ఆఫ్ పట్టాను రెడ్డిపోగు గురవయ్య 2019లో రద్దు చేసుకున్నాడు. అదే ఏడాది డిసెంబరులో కల్వరీ టెంపుల్ సొసైటీకి రిజిస్ట్రేషన్ చేశాడు. మొదట తాత్కాలికంగా చేసి.. తర్వాత 2020లో పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ చేసినట్లు బాధితులు చెబుతున్నారు.

భూమి హద్దుల్లోనూ మతలబులు

ఇదంతా చాలా విరుద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగిందని బాధితులు మాలకొండయ్య కుమారులు పసుపులేటి ప్రసాదరావు, హరిబాబు, సురేష్‌బాబు చెబుతున్నారు. వీలునామాలో హద్దులు లేవని చూపారని, జీవిఏలో ఒక తరహా హద్దులను పలకరించారని, రిజిస్ట్రేషన్‌లో ఇంకో తరహా హద్దులను చూపారని వెల్లడించారు. పత్రాలను సక్రమంగా చూడకుండా రిజిస్ట్రేషన్ ఎలా చేశారన్నదే ప్రశ్న.?

కోర్టులో తేల్చుకోవాలని రిజిస్ట్రేషన్ అధికారుల సూచన

తమ భూమికి నకిలీ వీలునామాతో రిజిస్ట్రేషన్ ఎలా చేశారని బాధితులు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను కలిసి అడిగారు. అందుకు తగిన సమాచారం ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ చేపట్టిన ఆ శాఖ అధికారులు తర్వాత జరిగిన తప్పిదాన్ని గుర్తించారు. ఈ వ్యవహారం అమ్మేవాళ్లూ, కొనేవాళ్లూ చూసుకోవాలని.. అవసరమైతే కోర్టులోనే తేల్చుకోవాలని సూచించారు. దీంతో బాధితులు కోర్టును కూడా ఆశ్రయించగా వీరికి అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ ఈ ఏడాది ఏప్రిల్‌లో జారీ అయ్యింది. అయితే అప్పటికే కల్వరీ టెంపుల్ నిర్వాహకులు దాని చుట్టూ ఇనుపకంచె వేశారు. కరోనా సమయంలో ఈ కొనుగోలు వ్యవహారం తమకు తెలియదని బాధితులు చెబుతున్నారు.

సిట్‌కు ఫిర్యాదు..న్యాయం చేయాలని వినతి

ఈ భూ వివాదంపై బాధితులు సిట్‌ను ఆశ్రయించారు. పూర్తిస్థాయిలో పత్రాలు అందజేశారు. నకిలీ వీలునామాతో రిజిస్ట్రేషన్ జరిగిన తీరు, అన్ని ఆధారాలతో కూడిన సమాచారం సిట్‌కు అందించారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులను కోరుతున్నారు. ప్రస్తుతం సిట్ దీనిపై విచారణ చేస్తోంది. నకిలీ వీలునామాతో రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తి కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఒంగోలులో భారీ అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

వస్తువులు ఉండటంతో మంటలు ఆర్పేందుకు ఎంత ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. ఒంగోలు అగ్నిమాపక కేంద్రంలో రెండు ఫైరింజన్లు, టంగుటూరు, కొండపి, అద్దంకి నుంచి మరో మూడు ఫైరింజన్లు మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఓ వైపు అర్పుతుంటే మరో వైపు నుంచి మంటలు రావటం గమనార్హం. మంటలు ఇతర భవనాలకు వ్యాపించకుండా అగ్నిమాపక అధికారులు చర్యలు చేపట్టారు. తెల్లవారుజామున మూడు గంటలకు ప్రమాదం జరిగితే రాత్రి 9 గంటల వరకు మంటలు అదుపులోకి రాలేదు. ఈ ప్రమాదంలో సుమారు కోటి రూపాయల వరకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అగ్ని ప్రమాదంలో ప్లాస్టిక్ పట్టలు, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతి కావటంతో సునీల్ కుటుంబ సభ్యులతో పాటు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో అగ్నిమాపక, పోలీస్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. మంటలు అదుపులోకి వస్తేనే అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో తెలియటానికి అవకాశం ఉంది. ఇన్‌ఛార్జి జిల్లా అగ్ని మాపక అధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఫైర్‌మెన్స్ మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరగలేదు

ఒంగోలు పట్టణంలోని పప్పు బజార్‌లోని ఓ గోడౌన్‌లో సంభవించిన అగ్నిప్రమాదం షార్ట్‌సర్క్యూట్‌తో సంభవించలేదని ఎపిసిపిడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కెవిజి సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగిందని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమై ఆ ప్రాంత ఏఇకి సమాచారం అందించారని, ఆయన ఘటన స్థలానికి చేరుకొని సరఫరా నిలిపివేశారన్నారు. ఆ పరిసర ప్రాంతాల విద్యుత్ మీటర్లు, విద్యుత్ సరఫరా లైన్లు పరిశీలించారన్నారు. ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసులు ఘటన స్థలాన్ని పరిశీలించి.. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించలేదని, దసరా ఉత్సవాల్లో భాగంగా బాణసంచా కాల్చినప్పుడు వచ్చిన నిప్పురవ్వలతో జరిగి ఉండవచ్చని అంచనా వేసినట్లు ఆయన తెలియజేశారు.

బాధితులను పరామర్శించిన దామచర్ల

ఒంగోలు పప్పుబజార్‌లో అగ్ని ప్రమాద బాధితులను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు పరామర్శించారు. గోడౌన్ యజమాని కొమ్మిశెట్టి సునీల్, కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సురేష్

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా పట్టణంలోని బాప్టిస్ట్ పాలేనికి చెందిన వేల్పుల సురేష్ మాదిగను నియమిస్తూ జిల్లా ఇన్‌ఛార్జి ముమ్మిడివరపు సుబ్బారావు మంగళవారం నాడు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం పొదిలి అధ్యక్షుడిగా వేల్పుల సురేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి తనకు పొదిలి అధ్యక్షుడిగా నియమించినందుకు ఎమ్మార్పీఎస్ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాదిగ, ఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షాలు మాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాదిగ, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు బొంత ఏసుదాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, ఎంఈఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోహిత్‌పాండేకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పామూరు

సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సెక్రెటరీ రోహిత్ పాండేకు కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ మునీర్ బాషా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఢిల్లీలోని రోహిత్ పాండే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి దసరాను పురస్కరించుకొని విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయదశమి తన జీవితంలో దేదీప్యమానంగా వెలుగొందాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు మునీర్ బాషా రోహిత్ పాండేకు తెలిపారు.

అమ్మవారి చీరల వేలం

ప్రజాశక్తి-కొండపి

దసరా నవరాత్రుల సందర్భంగా కొండపి గ్రామానికి చెందిన కళ్లగుంట అంకులయ్య అనే భక్తుడు అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. 9 రోజులు ఆరాధన సందర్భంగా వివిధ రూపాలలో అలంకరించిన అమ్మవారి చీరలకు దసరా రోజున వేలం నిర్వహించారు. ఈ వేలంలో అమ్మవారి 9 రకాల చీరలను రూ.1,50,000కు భక్తులు దక్కించుకున్నారు. అదే విధంగా అమ్మవారికి సమర్పించిన లడ్డూను సైతం వేలం నిర్వహించగా రూ.34,000కు భక్తులు పాడుకున్నారు. వేలం పాటల ద్వారా వచ్చిన నగదును విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయానికి అందించనున్నట్లు భక్తుడు అంకులయ్య తెలిపారు. అనంతరం పండుగ రోజున అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన నృత్య కళారూపాలు గ్రామస్థులను అలరించాయి.

ఘనంగా దసరా వేడుకలు

ప్రజాశక్తి-పొదిలి

దేవి నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు పట్టణంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ పార్వతి సమేత నిర్మమహేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం చివరి రోజు భవానీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. శివాలయం ఛైర్మన్ యక్కలి శేషగిరిరావు, ఇఒ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంగళవారం పార్వతి దేవి, వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామదేవత పొదిలమ్మ దేవస్థానం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ గ్రామ యువకులకు పార్వేట ఉత్సవం నిర్వహించారు.

పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-దర్శి



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

దసరా పండుగ రోజున పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. సోమవారం స్థానిక బూచేపల్లి స్వగృహంలో దసరా పండుగ సందర్భంగా పంచాయతీ కార్మికులు 100 మందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ దసరా పండుగ రోజున ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఎంతో సంతృప్తి కలిగిస్తుందన్నారు. అనంతరం దర్శి వాసవీ క్లబ్ వారి ఆహ్వానం మేరకు శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి వారి ఆలయంలో ఆలయ నిర్వాహకులు వేద మంత్రాలతో జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మకు, డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ బూచేపల్లి చిన్నసుబ్బారావు, దేవతి మహానంద, కొల్లా భాస్కర్, అచ్యుత ప్రకాష్, పానుగంటి కోటేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ రిసోర్స్ పర్సన్‌గా దొనకొండ జడ్పీ హెచ్‌ఎం

ప్రజాశక్తి-దొనకొండ



హెచ్‌ఎం రామాంజనేయులు

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకానికి రిసోర్స్ పర్సన్‌గా దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న వివి రామాంజనేయులు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించటం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకంలో రాష్ట్రంలో 665 పాఠశాలలు, జిల్లాలో ఎంపికైన 41 పాఠశాలల్లో దొనకొండ జడ్పీ పాఠశాల కూడా ఉంది. ఈ పథకం అమలు నిమిత్తం చేపట్టాల్సిన అంశాలపై శిక్షణ పొందేందుకు రాష్ట్రం నుంచి 26 మందిని రిసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేయగా వారిలో దొనకొండ జడ్పీ పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయులు రిసోర్స్ పర్సన్‌గా ఎంపికయ్యారు. వీరికి ఈ నెల 26 నుంచి 28 వరకు మూడు రోజులు ఢిల్లీలో శిక్షణ అందిచనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకంలో దొనకొండ జడ్పీ పాఠశాల ఎంపికవ్వటం, పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న తాను రిసోర్స్ పర్సన్‌గా ఎంపికవ్వటం ఎంతో ఆనందంగా ఉందని, పాఠశాలను రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చేలా బాధ్యతగా పనిచేస్తానని హెచ్‌ఎం రామాంజనేయులు వివరించారు.

క్రీడాకారులకు తోడ్పాటు: బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి



గెలుపొందిన క్రీడాకారులతో బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

క్రీడాకారులకు ఎల్లవేళలా తమ వంతు తోడ్పాటు ఉంటుందని దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. దసరా పండుగ సందర్భంగా వైఎస్సార్, బీఎస్సార్ మెగా క్రికెట్ టోర్నమెంట్ బూచేపల్లి యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో జరగ్గా మొత్తం 32 టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో మొదటి బహుమతిని దర్శి గణేష్ వారియర్స్ టీమ్ గెలువగా వారికి లక్షా 11వేల 116ను బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి అందించారు. రెండో బహుమతిని దర్శికి చెందిన చందు లెవన్స్‌కు దర్శి సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, బసిరెడ్డిపల్లి సర్పంచ్ కీసరి రాంభూపాల్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నపూస బాపిరెడ్డి రూ.60 వేలు అందించారు. మూడో బహుమతిను పొదిలి మండలం కుంచేపల్లికి అంజి పాంథర్స్ గెలువగా వారికి దర్శి మాజీ ఏఎంసీ ఛైర్మన్ కేవీ రెడ్డి రూ.40 వేలు బహుమతిని అందించారు. అదే విధంగా దర్శికి చెందిన సింహ లెవన్స్ గెలువగా వారికి తాళ్లూరు మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి రూ.20 వేలు అందించారు. టోర్నమెంట్ షీల్డ్‌ను దారెడ్డి సుధాకర్‌రెడ్డి అందించారు. బూచేపల్లి యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మధు, రాజశేఖర్ తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు మేలుకోకుంటే భవిష్యత్తు అంధకారమే

ప్రజాశక్తి-కొండపి



జగనాసుర దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబును అక్రమ కేసుల్లో ఇరికించి జైల్లోనే ఉంచి జగన్ మళ్లీ సిఎం కావాలనుకుంటున్నాడని, ప్రజలు మేలుకోకుంటే రాష్ట్ర భవిష్యత్తు అంధకారమేనని టిడిపి నాయకులు హెచ్చరించారు. కొండపిలో గాంధీబొమ్మ సెంటర్‌లో చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసనగా పార్టీ ఆదేశాల మేరకు జగనాసుర దహన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాలలో టిడిపి నాయకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొండపి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న గ్రామీణ ఎస్ఐ వెంకటేశ్వర్లు నాయక్

బండరాయి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



పలకల క్వారీలో బండరాయి మీద పడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రాయవరం గ్రామంలోనీ పలకల క్వారీల్లో సోమవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం రాయవరం గ్రామానికి చెందిన ఉప్పు మల్లికార్జున(31) ప్రతిరోజు లాగానే సోమవారం పనిలోకి వెళ్లారు. క్వారీలో కిందికి బండరాయిని పగలగొడుతున్న నేపథ్యంలో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా గైలోని బండరాయి మీద పడడంతో మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందాడు ప్రమాదాన్ని గమనించిన సహచర కూలీలు హుటాహుటిన మార్కాపురం గ్రామీణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎం వెంకటేశ్వరనాయక్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని దాదాపు రెండు గంటలకు శ్రమించి జెసిబి సహాయంతో బండరాలను తొలగించి మల్లికార్జున మృతదేహాన్ని బయటికి తీశారు. మృతదేహాన్ని మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ తెలిపారు.

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా మూర్తయ్య

ప్రజాశక్తి-దొనకొండ

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని వద్దిపాడు గ్రామానికి చెందిన పి మూర్తయ్య యాదవ్ ఎంపికయ్యారు. ఈ మేరకు యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాసయాదవ్ నుంచి ఉత్తర్వులు అందినట్లు మూర్తయ్య తెలిపారు. మండలంలోని అన్నీ గ్రామాల్లోని యాదవుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మూర్తయ్యయాదవ్ తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి-పొదిలి

వచ్చే శీతకాల పార్లమెంట్ సమావేశాల్లోని ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని జిల్లా ఇన్‌ఛార్జి ముమ్మిడివరం చిన్న సుబ్బారావు మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రకాశం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం పొదిలిలో జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు తొరటి ఆనంద్ మాదిగ వ్యవహరించగా ముఖ్య అతిథులుగా ముమ్మిడివరం చిన్న సుబ్బారావు మాదిగ హాజరై ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంటు సమావేశంలోనయినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి మాదిగలకు ఇచ్చినమాట నిలుపుకోవాలని, లేనిపక్షంలో 2024 ఎన్నికల్లో బిజెపిని ఓడించి తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి భిక్షాలు మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు బొంత ఏసుదాసు మాదిగ, కత్తి ఐజాక్ మాదిగ, తేలజాలరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆదిముల ప్రకాష్, జాతీయ ఉపాధ్యక్షులు జలదంకి నరసరావు మాదిగ, ఎంఎస్పి నాయకులు వర్ల దేవదాసు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-కొండపి

దసరా పండుగ సందర్భంగా కొండపిలోని సాయిబాబా ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో వైసిపి ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్

పేదలకు అన్యాయం చేశారు

ప్రజాశక్తి - యద్దనపూడి

టిడిపి ప్రభుత్వ కాలంలో నీరు - మట్టి పేరుతో నియోజకవర్గంలో పేదలకు అన్యాయం చేశారని వైసిపి నియోజకవర్గ ఇంచార్జి ఆమంచి కృష్ణ మోహన్ ఆరోపించారు. మండలంలోని పడమట పెద్దివారిపాలెం, పెద జాగర్లమూడి, యద్దనపూడి, యనమదల, చింతపల్లిపాడు గ్రామాలలో ఆయన మంగళవారం బైక్ ర్యాలి నిర్వహించారు. 50, 60సంవత్సరాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూముల లాగుకొని నీరు, మట్టి పేరుతో అన్యాయం చేశారని అన్నారు. ర్యాలీలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మున్సిపల్ ఛైర్మన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మోపిదేవి

ఎంపీ మోపిదేవి పరామర్శ

ప్రజాశక్తి - రేపల్లె

ఇటీవల పట్టణంలో పలువురి కుటుంభ సభ్యులను రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంభ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ దాసరి కృష్ణకుమారి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రెడ్డి రోశమ్మ, రేపల్లె మండలం పెనుమూడి ఎంపీటీసీ గొట్టిముక్కల ఆనంద్ మోహన్ బావమరిది ఆళ్ల నాగమల్లేశ్వరరావు ఇటీవల కాలంలో మృతి చెందారు. వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆయనతో పాటు బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైసిపి మండల కన్వీనర్ గాదె వెంకయ్య బాబు, పెనుమూడి సర్పంచ్ దారం విజయ్, రాజు, కాల్వ సర్పంచ్ తలశిల శ్రీనివాసరావు, పెటేరు, మోర్లవారిపాలెం, మొర్తోట, పిరాటలంక, సోడాయపాలెం పంచాయితీ కన్వీనర్లు కనపర్తి రవికిరణ్, యార్లగడ్డ సోమశేఖర్, రాణి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆయుధ పూజ చేస్తున్న డిఎస్‌పి వెంకటేశులు దంపతులు

డిఎస్‌పి ఆయుధ పూజ

ప్రజాశక్తి - బాపట్ల

విజయదశమి సందర్భంగా ఎఆర్ కార్యాలయంలో డిఎస్పి టి వెంకటేశులు సతీ సమేతంగా మంగళవారం ఆయుధ పూజ చేశారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ, చెడుపై విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమిని పురస్కరించుకుని సాంప్రదాయక దుస్తులు ధరించి శాస్త్రోక్తంగా ఘనంగా పూజ చేశారు. ఎస్బి ఇన్ స్పెక్టర్ వి సూర్యనారాయణ సతీసమేతంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలలో గొప్ప సందేశం ఉంటుందని అన్నారు. జీవనానికి అవసరమైన వ్యవసాయ పనిముట్లు, వస్తువులు, ఆయుధాలను దైవంగా భావిస్తూ పూజించడం కృతజ్ఞతాభావాన్ని సూచిస్తుందని అన్నారు. విజయదశమి పర్వదినోత్సవం ప్రజలందరికీ సుఖ సంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు. భద్రతా దళాలకు ఆయుధ పూజ అత్యంత ముఖ్యమైన పండగని అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి ఎండిహెచ్ ప్రేమ్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ ఎల్ మన్మధరావు, హెూంగార్డ్ ఆర్ఐ ఎల్ గోపీనాథ్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎ ఏలూరికి హారతులతో స్వాగతం

◆రాజుగారిపాలెంలో ప్రారంభమైన ప్రజారక్షణ యాత్ర ◆టిడిపి హయాంలో కట్టిన చెక్ డ్యామ్‌ల పరిశీలన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

వైసిపి అరాచక విధ్వంస పాలన, ప్రభుత్వ కుట్రలను ప్రజలకు వివరించేందుకు టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మండలంలోని రాజుగారిపాలెం నుండి మన పల్లెకు మన ఏలూరి పేరుతో పర్చూరు ప్రగతి ప్రతిజ్ఞ ప్రజారక్షణ యాత్ర ప్రారంభించారు. యాత్రకు ప్రజలు బ్రహ్మరధం పట్టారు. తొలుత క్యాంపు కార్యాలయంలో విజయదశమి ఆయుధ పూజ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి భారీ కాన్వాయ్‌తో రాజుగారిపాలెం చేరుకున్నారు. మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు ఆధ్వర్యంలో ఏలూరికి ఘన స్వాగతం పలికారు. పూలమాల, శాలువాతో సత్కరించారు. పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. శివాలయం, రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ ఎమ్మెల్యే ఏలూరి మహిళలు, వృద్ధులు, పెద్దలను ఆప్యాయంగా పలకరిస్తూ యాత్ర ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన రహదారులని వెంబడి తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటూ సాగారు. అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద బహిరంగ సభలో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 2014 -19కాలంలో వాగులపై పర్చూరు



రాజుగారిపాలెంలో హారతులతో స్వాగతిస్తున్న మహిళలు

నియోజకవర్గ వ్యాప్తంగా 100 చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేశామన్నారు. వృధాగా పోతున్న మురుగునీరు, వరద నీరును ఒడిసి పట్టేందుకు సుమారు రూ.5లక్షలు ఖర్చు చేసి ఈ వాగుపై 5చెక్ డాంల నిర్మాణం చేపట్టామని తెలిపారు. రైతులను సమన్వయం చేసి పటిష్టమైన ప్రణాళికతో నాణ్యమైన నిర్మాణం చేపట్టామన్నారు. ఈ చెక్ డాముల వల్ల రాజుగారిపాలెం, జొన్నతాళి గ్రామాలలో రైతులు పంటలు సాగు చేస్తూ వీటిని వృధాగా పోకుండా రీసైకిల్ చేసుకోగలుగుతున్నారని అన్నారు. విధ్వంసం, అరాచకం, దౌర్జన్యంతో మనుగడ సాగించడం కష్టమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు చేకూర్చాలని ఆకాంక్షించారు.

పర్చూరు : ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు మన పల్లెకు మన ఏలూరి యాత్ర పర్చూరు, దేవరపల్లి గ్రామాల్లో పర్యటించారు. స్థానిక వై జంక్షన్లోని అభయాంజనేయ స్వామికి పూజలు చేశారు. దేవరపల్లి అద్దంకమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో మహిళలు హారతులతో స్వాగతం పలికారు. చర్చిలో ప్రార్ధనలు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. తమాపార్టీ నేతలను అక్రమ కేసుల్లో నిర్బంధించి అధికార వైసిపి నేతలు ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. కార్యక్రమాల్లో దేవరపల్లి ఎంపిటిసి కాపు రవిచంద్ర, కొరిటాల సురేష్, ఎవి కృష్ణ, షంషుద్దీన్, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, మామిడిపాక హరిప్రసాద్, హుస్సేన్, కోట హరిప్రసాద్, ఆకుల శ్రీనివాసరావు, బాషా, కొల్లా బుల్లిబాబు, ఆకుల శ్రీనివాసరావు, తలారి శివ, కోడూరి శేషబ్రహ్మాచారి, బాజీ, జి నాగేశ్వరరావు, ఎం శ్రీనివాసరావు, కె సురేష్ పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎ ఏలూరి దేవరపల్లిలో హారతిస్తున్న మహిళలు

దెబ్బతిన్న పంటల పరిశీలన

●కరువు మండలాలుగా ప్రకటించాలి. ●ఎకరాకు రూ.10వేల పరిహారం ఇవ్వాలి. ●రైతు సంఘం నేతల డిమాండ్

ప్రజాశక్తి - యద్దనపూడి

ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో యద్దనపూడి, బల్లికురవ, మార్టూరు మండలాలలో రైతు సంఘం నాయకులు వర్షాభావ పరిస్థితుల వల్ల దెబ్బ తిన్న పంటలను పరిశీలించారు. ప్రత్తి, మిర్చి, జూట్, బోర్ల క్రింద సాగు చేసిన వరి పంటలను పరిశీలించిన అనంతరం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ళ రామ కోటేశ్వర రావు మాట్లాడారు. జిల్లాలో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన మెట్ట పంటలు వర్షాలు లేక ఎండి పోయాయి. సాగరు కాలువలో నీళ్ళు రాక మాగాణి సాగు చేయలేదని అన్నారు. గ్రామాలల్లో పంటలు సాగు చేసిన రైతులు ఆందోళనలో ఉన్నారని రైతు సంఘం నేతలు అన్నారు. ఇప్పుడు కూడా వర్షాలు పడకపోతే ఖరీఫ్‌లో వేసిన పంటలు ఎండి పోయాయి రబీలో వేయాలన్నా వర్షం లేకపోతే వేసే పరిస్థితి లేదని రైతులు వాపోయారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దెబ్బ తిన్న పంటలకు భీమా అమలు చేయాలని, ఎకరానికి రూ.10వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. రైతులు ఈ పాటికే తీసుకున్న పంట ఋణాలు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రబీలో



పంటల పరిశీలన అనంతరం మీడియాతో రైతు నేతలు

పంటలకు పూర్తి సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని కోరారు. యాత్రలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు, వీరవల్లి కృష్ణ మూర్తి, పాలెపు సాంబయ్య, పేర్ని నాగేశ్వరరావు, గొట్టిపాటి శేషాద్రి, జి మోహనరావు, ఎనికపాటి రాంబాబు, బి సూరి బాబు, ఇందుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : పంటలు ఎండిపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారని, సాగు నీరిచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. 9గంటలు నిరంతరాయంగా కరెంట్ ఇవ్వాలని కోరారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు.



అమెరికాలో ప్రశంసలు అందుకుంటున్న డాక్టర్ బీరం

కవిత్వానికి కొత్త గొంతులు

ప్రజశక్తి - చీరాల

కొత్త గొంతులు కవిత్వానికి ఊపిరి పోస్తున్నాయని ప్రముఖ కవి డాక్టర్ బీరం సుందరావు అన్నారు. అమెరికా సెలికానాంధ్ర యూనివర్సిటీలో జరిగిన అమెరికా సాహిత్య సదస్సులో సుందరరావు కవిత్వంలో కొత్త గొంతులు అనే అంశంపై ప్రసంగించారు. సధస్సుకు కవియిత్రి డాక్టర్ కె గీత అధ్యక్షుత వహించారు. రెండు రోజులు జరిగిన సధస్సులో ఉభయ తెలుగు రాష్ట్రలతో పాటు అమెరికా, కెనడా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాల ప్రజలు హాజరయ్యారు. కొత్త తరం రాస్తున్న కవితలలోని ప్రత్యేకతలను, వైవిధ్యాలను సుందరరావు వివరించారు. అనంతరం వంగూరి ఫౌండేషన్ తరుపున సుందరరావును ఘనంగా సత్కరించారు. సదస్సులో ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ కొలకలూరి ఐసాక్, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, డాక్టర్ రాజు, డాక్టర్ ఆనంద్ పాల్గొన్నారు.

దళితుల భూముల్లో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - పంగులూరు

దళితులకు చెందిన భూముల్లో పెత్తందారుల అవసరాల కోసం రోడ్డు నిర్మించిన సంఘటన మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామ సరిహద్దుల్లో జరిగింది. గ్రామానికి చెందిన ఎనికపాటి వారి చెరువులో సర్వే నెంబరు 284లో 19మంది దళిత కుటుంబాలకు 9ఎకరాల భూమిని 1983లో ఇచ్చారు. ఈ భూమిని కన్వర్షన్ చేసి పట్టాలు, పాస్ పుస్తకాలు అప్పుడే ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి 30 నుండి 40సెంట్లు వరకు ఇందులో ఉంది. అప్పటి నుండి ఆ భూమిని దళితులు సాగు చేసుకుంటున్నారు. ఇప్పటి ప్రభుత్వం ఈ భూమిని కూడా రీ సర్వే చేసి దళితులకు జగనన్న శాశ్వత భూహక్కు పథకం కింద పాస్ పుస్తకాలు కూడా ఇచ్చారు. అయితే కొంతమంది పెత్తందారులు తమ భూములకు రోడ్డు చూపిస్తే వాళ్ల భూములకు ధరలు పెరుగుతాయనే లక్ష్యంతో దళితుల భూమిలో రోడ్డు వేస్తున్నారు. ప్రోక్లైన్ పెట్టి రెండు రోజులుగా అక్కడ రోడ్డు వేస్తున్నారు. తమ భూముల్లో రోడ్డెందుకు వేస్తున్నారని దళితులు ప్రశ్నించినా తమను లక్షపెట్టకుండా ఆ భూముల్లో రోడ్డు వేస్తున్నారని దళితులు తెలిపారు. సుమారు 40ఏళ్లపైగా ప్రభుత్వం తమకు భూములు ఇచ్చిందని తెలిపారు. ఆ భూములను సాగు చేసుకుని బ్రతుకుతున్నామని తెలిపారు.



భూములు పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

తక్షణమే రోడ్డు నిర్మాణాన్ని ఆపాలి
సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

తూర్పు కొప్పెరపాడు దళితుల భూముల్లో పెత్తందారులు వేస్తున్న రోడ్డు నిర్మాణాన్ని వెంటనే ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. దళితుల భూముల్లో పెత్తందారులు వేసిన రోడ్డును మంగళవారం ఆయన పరిశీలించారు. తక్షణమే అధికారులు ఆ రోడ్డు నిర్మాణాన్ని ఆపాలని కోరారు. లేకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. సిపిఎం జిల్లా నాయకుడు రాయిని వినోద్ బాబు, వేమూరి సునంద బాబు, పాలపర్తి అబ్రహం, పాలపర్తి శేషగిరి, పాలపర్తి నాగరాజు, పాలపర్తి లక్ష్మయ్య, నూకతోటి ప్రసంగిరావు, ఉసురుమాటి బెనర్జి, పాలపర్తి దశరథ, ఎడ్లూరి శేషయ్య, వేమూరి ప్రకాశం పాల్గొన్నారు.

భువనేశ్వరితో డాక్టర్ సజ్జా

ప్రజాశక్తి - చీరాల

చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రజలు అందరు ఖండిస్తున్నారని పొన్నూరు మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ సజ్జ హేమలత అన్నారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని రాజమండ్రిలో ఆమె మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. వైసిపి అరాచకాలకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.



భువనేశ్వరితో డాక్టర్ సజ్జ

100 స్థానాల్లో పోటీ చేస్తాం

ప్రజాశక్తి - చీరాల

బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాల అభ్యున్నతి కోసం రాబోయే ఎన్నికల్లో వంద స్థానాలలో జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు శీలం వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని ఎస్టీ యానాది కాలనిలో పలువురిని వివిధ పదవులలో నియమించారు. బిసిలలో ఉన్న అన్ని కులాలకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం లేదని అన్నారు. బిసిలకు రక్షణ చట్టం చేయాలని కోరారు.

కానరాని దసరా వేడుకలు

ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడమే కారణమంటున్న పరిశీలకులు

ప్రజాశక్తి-పీసీపల్లి
పీసీపల్లి మండలంలో దసరా వేడుకలు కనిపించలేదు. ప్రధానంగా చిల్లర దుకాణాలు, బట్టల షాపుల వద్ద పండుగ వాతావరణం నెలకొని ఉండేది. కానీ ఈ సంవత్సరం రోజువారి వ్యాపారానికి మించి పది శాతం కూడా వ్యాపారాలు జరగలేదని వ్యాపారస్తులు అంటున్నారు. సహజంగా దసరా రోజు మాంసం దుకాణాలు కూడా ఉదయం పూట బాగా రద్దీగా ఉంటాయి. అలాంటిది ఈరోజు అవి కూడా వెలవెలబోయాయి. మండలం మొత్తం మీద రోజుకు రూ.5 వేలు దాకా వ్యాపారం జరిగే చిల్లర దుకాణాలు పీసీపల్లి మండలం మొత్తం మీద 15 వరకు ఉన్నాయి. ప్రధానంగా గుంటుపల్లి, పెద్ద యర్రపాడు, వెంగళాయపల్లి, పెదఅలవలపాడులో వ్యాపారాలు బాగా జరుగుతాయి. ఆదివారం దుర్గాష్టమి మొదలు, మంగళవారం విజయదశమి వరకు కూడా మూడు రోజులుగా రూ.20 వేల వ్యాపారం కూడా జరగలేదని వ్యాపారస్తులు అంటున్నారు. గతంలో దసరా సందర్భంగా రోజుకు 40 మంది రెడిమేడ్ దుకాణాల వద్ద చిన్న పిల్లలకైనా బట్టలు కొనుగోలు చేస్తారు. కానీ సోమ, మంగళవారాల్లో 20 మంది కూడా చిన్న పిల్లల కోసం కూడా కొనుగోలు చేయడం లేదని బట్టల షాపు యజమాని నారపురెడ్డి మాలకొండయ్య తెలిపారు. దూర ప్రాంతాల నుంచి బంధువులు సరిగా రాకపోవడంతో టీ దుకాణాలు, ఫ్యాన్సీ స్టోర్లు కూడా రోజువారి వ్యాపారం మాత్రమే సాగుతుంది. సంక్రాంతి, కనుమ పండుగ తర్వాత అత్యధికంగా వేట మాంసం, చికెన్ వాడేది దసరా పండుగ రోజే. ఈ విధంగా ఎలాంటి వ్యాపారాలు జరగక దసరా పండుగ వెలవెలబోయింది. గత సంవత్సరం మిరప పంట మినహా వ్యవసాయంలో పెద్దగా ఆదాయం లేకపోవడం, ఈ సంవత్సరం వర్షాలు లేక పెద్దగా వ్యవసాయం సాగు చేయకపోవడం మూలంగా దసరా పండుగను పెద్దగా చేయలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.


వ్యాపారం లేక వెలవెలబోతున్న ఓ ఫ్యాన్సీ షాపు


జమ్మిచెట్టుకు పూజల్లో పాల్గొన్న శిద్దా రాఘవరావు దంపతులు

దసరా వేడుకల్లో మాజీ మంత్రి శిద్దా

ప్రజాశక్తి-చీమకుర్తి
చీమకుర్తి మండలంలో దసరా పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక హరిహర క్షేత్రంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న విజయదశమి వేడుకల్లో ముగింపు రోజు రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. వారికి ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ సమదాయంలోని వివిధ ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. తొమ్మిది రకాల నైవేద్యాలు, సారెలు సమర్పించారు. శమీ వృక్షానికి విశేష పూజలు నిర్వహించి, బాణాన్ని ఎక్కుపెట్టారు. పారువేట కార్యక్రమం నిర్వహించారు. వేడుకలు తిలకించడానికి భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శిద్దా వెంకటేశ్వర్లు, సుబ్బమ్మ ట్రస్టు సభ్యులు శిద్దా పాండురంగారావు, సుధావళి దంపతులు, శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా సాయిబాబు, శిద్దా పెదబాబు, శిద్దా కాశీవిశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య మహిళలు చాట్ల సువర్చల, కొణిజేటి సువర్ణ, ధనలక్ష్మి, మాధవి, వాసవి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ దేవస్థానాల్లో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. సోమవారం అత్యంత వైభవంగా విద్యుత్ కాంతులతో గ్రామోత్సవం జమ్మిచెట్టు వద్ద పార్వేట పూజలు నిర్వహించారు. ఉప్పుగుండూరు శివాలయం దేవస్థానం సంబంధించి పూజారి రంగయ్య పంతులు జమ్మిచెట్టువద్ద పార్వేట పూజలు నిర్వహించారు. వేణుగోపాళ స్వామి దేవస్థానం సంబంధించి చైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజారి దివి శ్రీధర్‌బాబు పార్వేట పూజలు నిర్వహించారు. అనంతరం అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

కొండపి: కొండపి పోలీసు స్టేషన్‌లో విజయదశమి సందర్భంగా ఆయుధ పూజ కార్యక్రమాలు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది మాట్లాడుతూ కొండపి ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని కోరారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కొండపి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు 'కొండపి' విద్యార్థులు

ప్రజాశక్తి-కొండపి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా నుంచి పాల్గొననున్న విద్యార్థుల ఎంపిక ఒంగోలులో నిర్వహించినట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ వైకే శ్రీనివాసరావు తెలిపారు. తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలకు 30 మంది విద్యార్థులు ఎంపికైన ట్లు వాటిలో ఎక్కువ మంది కొండపి మండలం కట్టావారిపాలెం మన ఊరి వికాసం తరుపున వచ్చిన విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. ఈ నెల 29న 21వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. ఎంపికకు కొండపి మండలం కట్టావారిపాలెం మన ఊరి వికాసం నుంచి విద్యార్థులు ఎక్కువ మంది వచ్చినట్లు చెప్పారు. ప్రతి ఆదివారం మన ఊరి వికాసం తైక్వాండో విద్యార్థులకు శిక్షణ అంతర్జాతీయ తైక్వాండో మాస్టర్ మారుతి ప్రసాదు, వాసు ఇస్తున్నారు.


తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఉపాస్ హార్ట్ కేర్ సెంటర్ ప్రారంభం

అత్యాధునిక క్యాథల్యాబ్‌తో వైద్యసేవలు: డైరెక్టర్లు

ప్రజాశక్తి-ఒంగోలు
ఉపాస్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వారి రెండో యూనిట్ అయిన ఉపాస్ హార్ట్ కేర్ సెంటర్‌ను అత్యాధునిక క్యాథల్యాబ్‌తో ఒంగోలులోని రాజమ్మ హాస్పిటల్ ప్రాంగణంలో హాస్పిటల్ డైరెక్టర్లు సోమవారం ప్రారంభించారు. ఒంగోలులోని ఉపాస్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఇప్పటికే న్యూరో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, గైనకాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో, ఆప్తమాలజీ, జనరల్ సర్జరీ మరియు కార్డియాలజీ (గుండె) విభాగం సేవలను ఒంగోలు నగరంలో అందిస్తున్నారు. హార్ట్ కేర్ సెంటర్‌లో అత్యాధునిక క్యాథల్యాబ్ వైద్యసేవలు (యాంజియోగ్రామ్ సేవలు) పేద మరియు మధ్యతరగతి వారికి అందుబాటులో ఉంటాయని డైరెక్టర్లు డాక్టర్ ఉమాపతిచౌదరి, డాక్టర్ ప్రకాష్‌చవల, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ ప్రముఖ గుండె వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ చివుకుల శ్రీధర్, ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఉప్పలపాటి శ్రీనివాసులు, ప్రముఖ న్యూరో వైద్యులు పోకూరి శ్రీనివాస్, సాధారణ వ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాసులు, క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్, కంటి వైద్యనిపుణులు రామచంద్రారెడ్డి, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.


హార్ట్ కేర్‌ను ప్రారంభించిన ఉపాస్ డైరెక్టర్లు


చిన్నవెంకన్నపాలెంలో నిరసన దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామి

వైసిపిని తరిమేందుకు సిద్ధంకండి

ప్రజాశక్తి-కొండపి: రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని తరిమేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని చినవెంకన్నపాలెం గ్రామంలో బాబు తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం రిలే నిరాహార దీక్ష కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ చంద్రబాబుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆయనను అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టి ముఖ్యమంత్రి రాక్షసానందం పొందుతున్నారన్నారు. కొండపి నియోజకవర్గంలో వైసిపి అరాచకాలు ఎక్కువయ్యాయని, యువతకు ఉద్యోగాలు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక యువతకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ రాక్షస పాలనకు ఓటు అనే ఆయుధంతో చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొర్రెపాటి రామయ్యచౌదరి, బత్తుల నారాయణస్వామి, రాష్ట్ర నాయకులు వసంతరావు, మిట్టపాలెం నాయకులు ఐనంపూడి రమేష్, చిన్నవెంకన్నపాలెం టిడిపి నాయకులు, మహిళలు, మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేడు కనిగిరికి ఎమ్మెస్ రాజు సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-కనిగిరి
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుపై జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కక్షపూరితంగా, నిరాధారమైన ఆరోపణలతో అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎమ్మెస్ రాజు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్ర అనంతపురం అంబేద్కర్ బొమ్మ నుంచి మంగళగిరిలోని అంబేద్కర్ బొమ్మ వరకు (అమరావతి) చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం ఉదయం 11 గంటలకు కనిగిరికి చేరుకోనున్నట్లు కనిగిరి టిడిపి కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. సైకిల్ యాత్రకు సంఘీభావం తెలిపిన అనంతరం కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌లో దళితుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కొండపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి, ఎస్ఎన్ పాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్, గూడూరు, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జులు పాశం సునీల్, గూడూరి ఎరిక్షన్‌బాబు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని టిడిపి ఎస్సీ సెల్ శ్రేణులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాలినేని కలిసిన చింతలచెరువు, దద్దాల

ప్రజాశక్తి-కనిగిరి
మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాస గృహంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్య నారాయణరెడ్డి, హనుమంతునిపాడు జెడ్పిటిసి దద్దాల నారాయణ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. కనిగిరి నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల ను బాలినేనికి వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ విజయానికి కృషి చేస్తామని వారు బాలినేనికి తెలిపారు.


బాలినేనితో చింతలచెరువు, దద్దాల


జనంతో సముద్రం తీరం

సందడిగా పాకల సముద్రతీరం

ప్రజాశక్తి-సింగరాయకొండ
సింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరం మంగళవారం సందడిగా మారింది. దసరా పండుగ కావటంతో సోమ మంగళవారాలు పండగలు చేసుకొని సాయంత్రం సమయంలో పాకల సముద్ర తీరానికి జనం భారీగా తరలివచ్చారు. సాయంత్రం సమయంలో కందుకూరు ప్రాంతం నుంచి దసరా నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించుకొని విగ్రహాలతో సముద్రానికి రావటం కనిపించింది. దీంతోపాటు సెలవు కావడంతో బుధవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కావడం వలన ముందుగా సముద్ర తీరానికి చిన్నారులతో తరలివచ్చి సందడి చేశారు.

ఆలయ ఆదాయం రూ.5.36 లక్షలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి వారి ఆలయానికి ఆదివారం రూ.5,36,832 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.97,510, స్వామివారి లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.27,890, స్వామివారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళాలు రూ.69,316, స్వామివారి ఆలయం వద్ద నిర్మిస్తున్న మహా ప్రాకార నిర్మాణానికి దాతలు ఇచ్చిన విరాళం రూ.3,33,116, ఇతర విరాళాలు రూ.9,000 వచ్చినట్లు చెప్పారు. ఇందులో ఆలయ మహాప్రాకారం నిర్మాణానికి గుంటూరు జిల్లా, ఫిరంగిపురం గ్రామానికి చెందిన రావిపాటి లక్ష్మీ నరేంద్ర, అమరావతి దంపతులు రూ.3,00,000 విరాళం ఇచ్చినట్లు చెప్పారు.

కారుమంచిలో తాగునీటికి కటకట..

- కొనుగోలు చేస్తేనే తాగు నీరు
- కలుషితమైన కారుమంచి చెరువు నీరు
- వ్యాధుల బారిన ప్రజలు
- ఫలించని అశోక్ బాబు కృషి


నీరు అడుగంటి ఉన్న కారుమంచి చెరువు


నీటి సరఫరాకు ఏర్పాటు చేస్తున్న పైపు

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని కారుమంచి గ్రామస్తులు మంచినీటికీ కటకటలాడాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా చెరువులోని మురికి నీటిని వాడుతూ ప్రజలు చర్మవ్యాధుల బారిన పడుతున్నారు. ఆ మురికి నీరు కూడా అరకొరగానే సరఫరా అవుతున్న పరిస్థితి గ్రామంలో నెలకొంది. దీంతో దసరా పండుగ సమయంలో కూడా గ్రామంలో మంచినీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల స్థాయి అధికారులతో పాటు జిల్లా ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి మంజూరు చేయించుకున్న నిధులు సైతం టెండర్ల దశలో పనులు అడుగు ముందుకు పడలేదు. దీంతో గ్రామస్తులు గత కొన్నేళ్లుగా మంచినీటి కోసం కట కటలాడుతున్నారు.

ఊరు ఘనం.. అభివద్ధి శూన్యం..

కారుమంచి గ్రామం అనేకమంది ప్రముఖులకు జన్మనిచ్చిన నేల. ఈ గ్రామానికి చెందిన పలువురు జిల్లా, రాష్ట్ర స్థాయిలో సైతం చక్రం తిప్పే వారిగా ఉన్నారు. 6 వేల మంది జనాభా కలిగి ఉన్న కారుమంచి గ్రామంలో అనేక మంది ప్రముఖులు ఉన్నప్పటికీ గ్రామానికి సరైన నీటి సౌకర్యం లేకపోవడం గమనార్హం. గ్రామస్తుల నీటి అవసరాలకు గ్రామం నడిబొడ్డున ఉన్న చెరువు నీరే దిక్కు. ఈ చెరువు వేసవి సమీపిస్తుండగానే నీరు అడుగంటి పోతుంది. ఏ చెరువు నీరైనా అడుగంటితే సహజంగానే కలుషితమైన మురికి నీరే చెరువు అడుగు భాగాన ఉంటుంది. ప్రస్తుతం చెరువు అడుగంటి పోవడంతో గ్రామస్తులు నీటికి పడరాని పాట్లు పడుతున్నారు. ఇక తాగునీటికి వస్తే గ్రామంలోని ప్రైవేట్ ఆర్ ఓ ప్లాంట్ల నీరే దిక్కు. ఈ నీటిని బబుల్ రూ.5లు లెక్కన గ్రామస్తులు కొనుగోలు చేసి గుక్క తడుపుకోవాల్సిన పరిస్థితి.

గ్రామస్తులకు నీటి సరఫరా ఇలా..

కారుమంచి గ్రామ చెరువు సమీపంలోని మోటారు బోర్లు ద్వారా ఓ.హెచ్‌ఆర్ ట్యాంకుకు నీరు ఎక్కించి అక్కడ నుంచి పైపులైను ద్వారా ఇంటింటికి నీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం చెరువు నీరు అడుగంటిపోయి ట్యాంకు కు సరిపడా నీరు సరఫరా కావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు కూడా దీనికి తోడవడంతో గ్రామస్తులకు నీటి సమస్య మరింత జఠిలమైంది. దసరా పండుగ రావడంతో గ్రామస్తుల నుండి మరిన్ని విమర్శలు వ్యక్తం అవుతాయని భావించిన ప్రజాప్రతినిధులు హడావిడిగా ఒక పైపును కొనుగోలు చేసి ఓ.హెచ్‌ఆర్ ట్యాంకుకు నీటిని ఎక్కిస్తున్నారు.

గ్రామస్తుల నీటి సమస్య వినతికి స్పందించిన కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో చెరువు సమీపంలోని బావులను శుభ్రపరిచి నూతనంగా మోటార్లను కొనుగోలు చేసి ఆ మోటార్ల ద్వారా సరిపడా నీటిని ట్యాంకుకు ఎక్కించి గ్రామస్తులకు నీరు సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించారు. మంచినీటి వినియోగానికి నిధులు మంజూరైనప్పటికీ టెండర్ల ప్రక్రియలో ఏర్పడిన అనిశ్చితి వల్ల పనులు ప్రారంభానికి నోచుకోలేదు. దీనికి తోడు గ్రామంలో గత మూడేళ్లుగా శాశ్వత పంచాయతీ కార్యదర్శి లేకపోవడం కూడా కారణంగా ఉంది.

చర్మవ్యాధుల బారిన గ్రామస్తులు..



గ్రామ చెరువులోని కలుషిత నీటితో గ్రామస్తులు చర్మవ్యాధుల బారిన పడుతున్నారు. దీనిపై తనకు ప్రతిరోజూ గ్రామస్తులు నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ వారంలోనే జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తాను. గ్రామస్తుల మంచినీటి వినియోగం కోసం మంజూరైన జడ్పీ నిధులు రూ10 లక్షలతో టెండర్లు పిలిచి వెంటనే పనులు ప్రారంభించాలి.

మన్నం శ్రీనివాస్, సర్పంచ్, కారుమంచి.

అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాను

గ్రామంలోని నీటి సమస్య నా దృష్టికి రాలేదు. నీటి సమస్యను ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కషి చేస్తాను. సమస్య పరిష్కారానికి ట్యాంకులోని నీటికి తగిన మోతాదులో బ్లీచింగ్ కలిపి సరఫరా చేయడం వల్ల తాత్కాలికంగా సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

ఎ సుబ్బారావు, ఏఈ, ఆర్ డబ్ల్యుఎస్, కారుమంచి.


ముళ్ల చెట్లతో మూసుకుపోయిన రహదారి

రహదారిని బాగు చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని గోళ్లవిడిపి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ముళ్ళ చెట్లు పెరిగి అధ్వాన్నంగా తయారైంది. యర్రగొండపాలెం నుంచి గోళ్లవిడిపికి వెళ్లాలన్నా, రావాలన్నా యర్రగొండపాలెం, త్రిపురాంతకం రోడ్డు వరకు రహదారి ముళ్ల చెట్లతో మూసుకుపోయింది. వాహనదారులు వెళ్లాలంటే ముళ్ల చెట్ల కొమ్మలు కళ్లకు తగిలి ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రహదారికి మరమ్మతులు చేసి ప్రమాదాలు నివారించాలని గోళ్లవిడిపి గ్రామస్తులు కోరుతున్నారు.


కరణం వెంకటేష్‌ను పరామర్శిస్తున్న మంత్రి సురేష్

వెంకటేష్‌కు మంత్రి సురేష్ పరామర్శ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి కరణం వెంకటేష్‌ను రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మంగళవారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వెంకటేష్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

దాణాను ఉచితంగా అందజేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పశ్చిమ ప్రాంతంలో పశు పోషణ చేసుకుంటూ జీవించే వారిలో ఎస్‌సిలు, ఎస్‌టిలు కూడా అధికంగానే ఉన్నారు. ప్రస్తుతం పచ్చిగడ్డి దొరికే పరిస్థితి లేదు. ఎండుగడ్డి ధరలు ఆకాశానంటుతున్నాయి. దీంతో పశువులను పోషించుకోలేక సంతల్లో అమ్ముకునే పరిస్థితి దాపురించింది. కాగా ప్రభుత్వం కూడా టిఎంఆర్ సమీకత దాణాను కేజీ రూ.6.50లకు విక్రయిస్తోంది. అయితే పశువులు అధికంగా ఉండడంతో టిఎంఆర్ సమీకత దాణాను కొనుగోలు చేయాలన్నా ఎస్సీ, ఎస్టీ పశు పోషకులకు భారంగా మారుతుందని సిపిఎం గిరిజన సంఘ నాయకులు భూమని వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు. అసలే కరువు కాటకాలతో పూట గడవడం కూడా కష్టంగా ఉన్న ఈ రోజుల్లో దాణాను కొనుగోలు చేసి పశువులను పోషించుకునే శక్తి తమకు లేదంటున్నారు. అందుచేత ఎస్సీ, ఎస్టీ పశు పోషకులకు టిఎంఆర్ సమీకత దాణాను ఉచితంగా అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేకుంటే పశువులను పోషించుకోలేక వచ్చిన ధరకే అమ్ముకోక తప్పదని వాపోతున్నారు.

'జగనాసుర' దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి-మర్రిపూడి

మర్రిపూడి మండలంలోని అన్ని గ్రామాలలో కూడా చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు కొండపి ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య పిలుపు మేరకు జగనాసుర దహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మర్రిపూడి మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రవీంద్ర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో అన్ని సౌకర్యాలతో టిడిపి సీనియర్ నేత డాక్టర్ మన్నె రవీంద్ర నిర్మించిన రవీంద్ర మల్టీస్పెషాలిటి హాస్పటల్‌ను మంగళవారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ మన్నె రవీంద్ర నాలుగు దశాబ్దాల కిందట యర్రగొండపాలెం వచ్చి రవీంద్ర నర్సింగ్ హోంను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ముఖ్యంగా పశ్చిమ ప్రాంత ప్రజానీకంతో పాటు తెలంగాణలోని మహబూబ్ నగర్, రంగారెడ్డి, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో రోగులు వచ్చి చికిత్సలు పొందుతుంటారు. తక్కువ ఖర్చుతో అతి ఖరీదైన వైద్యం ఇక్కడ లభిస్తుండడంతో పేదలు ఎక్కువగా ఆయన దగ్గరకే వస్తుంటారు. పేదలకు మంచి సేవలు అందిస్తూ భవిష్యత్తులో మరింత ముందుకు సాగాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్ కోరారు. హాస్పటల్‌లోని


వార్డులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

అన్ని వార్డులను పరిశీలించారు. అన్నింటిని స్వయంగా పరిశీలించిన ఆయన జిల్లా స్థాయిలో ఉన్నటువంటి హాస్పటల్స్‌లో కూడా ఇటువంటి సౌకర్యాలు లేవన్నారు. అన్ని సౌకర్యాలతో వెనుకబడిన ఈ ప్రాంతంలో హాస్పటల్ నిర్మించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అని దామచర్ల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మన్నె రవీంద్ర స్నేహితులు, ఐఎంఏలోని పలువురు వైద్యులు, బంధువులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


ఆయుధ పూజ నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీహరి

పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ

ప్రజాశక్తి-పుల్లలచెరువు

విజయాలకు చిహ్నమైన విజయదశమి అందరికీ అన్ని రంగాల్లో విజయం చేకూర్చాలని పుల్లలచెరువు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. మంగళవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు అన్ని విషయాలలో విజయవంతంగా ముందుకు సాగుతూ పుల్లలచెరువు పోలీస్ శాఖ పేరు ప్రతిష్టలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జానకి రఘు, గ్రంథిశిల వెంకట కష్టారావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలో దసరా వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐనముక్కల గ్రామంలో మంతనాలమ్మ, పోలేరమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యంతో కూడిన బోనాలు సమర్పించారు. దోర్నాల పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో, పోలేరమ్మ ఆలయంలో, శివాలయంలో, మోట్ల మల్లికార్జునపురంలోని శివాలయంలో సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యాయం గెలుస్తుంది.. బాబు బయటకు వస్తారు

కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుంది. చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి ఆకాంక్షించారు. సోమవారం రాత్రి మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామంలో టిడిపి అధిష్టానం చేపట్టిన జగనాసుర వధ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు అధికంగా బయటకు వచ్చి సీఎం జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ స్వామి, టిడిపి నాయకులు నాడు


జగనాసుర వధను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

నరకాసుర వధ..నేడు జగనాసుర వధ. అంటూ తూర్పునాయుడుపాలెంలో నాయకులు నినదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తల్లపనేని రవికుమార్, ఉప సర్పంచ్ డాలు వెంకట్రావు, గ్రామ టిడిపి అధ్యక్షులు పాతూరి వెంకటేశ్వర్లు, నాయకులు ఈదర ప్రభాకరరావు, దామచర్ల పిచ్చయ్య, దార్ల నరసింహారావు, పర్రె గోవర్ధన్, మహిళా నాయకులు గద్దం కవిత, దామచర్ల రాధా రాణి తదితరులు పాల్గొన్నారు.

'జగనాసుర సైకో' ప్రతులు దహనం

ప్రజాశక్తి - రేపల్లె

వైసిపి అధికారానికి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో అమావాస్య చీకట్లు అలము కున్నాయని ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. విజయదశమి సందర్భంగా చెడుపై విజయం సాధించాలని కోరుతూ జగనాసుర సైకో ప్రతులను మంటల్లో వేసి దహనం చేశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలనను భూస్థాపితం చేసేందుకు టిడిపి శ్రేణులు సమాయత్తం కావాలన్నారు. అభివృద్ధి, భావితరాల భవిషత్ కోసం పాటుపడిన చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టటం దుర్మార్గమన్నారు. వైసిపి పాలనలో తెలుగుజాతి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని అన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే, హక్కులకు భంగం కలిగించటం, అక్రమ కేసులు, అణచివేతలు, నిర్బందాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చెయ్యటం పరిపాటిగా మారిందని అన్నారు. ఓటమి భయంతోనే జగన్‌రెడ్డి తనకు అంటిన మరకను ఇతరులకు అంటించాలనే రాజకీయ కుట్రతో చంద్రబాబుపై అక్రమ కేసులు



సైకో పోవాలి కరపత్రాలు దగ్ధం చేస్తున్న ఎంఎల్ఎ సత్యప్రసాద్

పెట్టారని ఆరోపించారు. అధికార పార్టీ చేస్తున్న శాండ్, మైన్, వైన్ స్కాంలను ప్రతిపక్షాలు ఎక్కడ బయట పెడతారోనని భయపడి అణచివేతలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. స్కిల్ కేసులో రూ.300కోట్లు అవినీతి అని ప్రచారం చేసి ప్రస్తుతం రూ.27కోట్లని చెప్పటం సిగ్గుచేటన్నారు. జగన్మోహన్‌రెడ్డి తన తండ్రి పాలనను అడ్డుపెట్టుకుని రూ.45వేల కోట్లు దోచుకున్నడని, వాటిలో రూ.5వేల కోట్లు సీజ్ చేశారని గుర్తు చేశారు. వైసిపి నుండి రాష్ట్రానికి విముక్తి కలిగించాలని కోరారు. సుపరిపాలన అందించేందుకు చంద్రబాబు త్వరలో బయటకు రావాలని వేడుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, పంతాని మురళీధరరావు, పట్టణ అధ్యక్షుడు జీపీ రామారావు, జీవి నాగేశ్వరరావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, వై లక్ష్మీ, డి జయప్రద, వై ధర్మతేజ పాల్గొన్నారు.

బాపట్ల : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి కార్యాలయం వద్ద జగనాసుర దహనం సోమవారం నిర్వహించారు. టిడిపి ఇంచార్జ్ నరేంద్ర వర్మ నాయకులతో కలసి సైకో పోవాలని రాసి ఉన్న పత్రాలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో పట్టణం, మండలం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

యద్దనపూడి : యద్దనపూడి, గన్నవరం గ్రామాలలో చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు జగనాసుర దహనం కార్యక్రమం చేపట్టారు. అన్యాయంపై న్యాయం విజయం సాధించాలని నినాదాలు చేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు లక్ష్మీనరసయ్య

మాదిగల విశ్వరూప మహాసభ

ప్రజాశక్తి- పంగులూరు

వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని, బిల్లుకు చట్టబద్దత కల్పించాలని మహజన సోషలిస్ట్ పార్టి బాపట్ల జిల్లా ఆధ్యక్షులు బుడంగుట్ల లక్ష్మీనరసయ్య మాదిగ డిమాండ్ చేశారు. నవంబర్ 7న మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగే మహా పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. మహాసభ కరపత్రాన్ని మండలంలోని రేనంగివరంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మట్టకొయ్య రాము, ఉపాధ్యక్షుడుగా ఎలీషా, ట్రెజరర్‌గా పాలపర్తి అశోక్, కార్యదర్శిగా విజయకుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా కో కన్వీనర్ పల్లెపోగు నాని, రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ దొడ్డు వందనం, రమేష్, కొరుసపాడు మండల ఇన్చార్జి మారుతి ప్రసాద్, సందిపోగు రంగయ్య, ఆదాము, రవి, బాబు, జోషి పాల్గొన్నారు.

మార్టూరు ఎస్‌ఐగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్



ఎస్ఐ ఎం శ్రీనివాసరావు

ఎస్ఐగా ముసల శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2018 బ్యాచ్ కి చెందిన ఆయన అద్దంకి, జె పంగులూరు, పెదదోర్నాల స్టేషన్లలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించారు. మార్టూరు ఎస్ఐగా పనిచేస్తున్న కోడూరి కమలాకర్‌ను జిల్లా విఆర్‌కు అటాచ్ చేశారు. దీంతో అయన స్థానంలో జిల్లా డిసిఆర్బిలో వెయిటింగ్‌లో ఉన్న ఎం శ్రీనివాసరావుని ఎస్పీ వకూల్ జిందాల్ ఎస్ఐగా నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ శ్రీనివాసరావును ఏఎస్ఐలు షేక్ సైదా, కొండ్రకొండ వెంకటేశ్వర్లు, షేక్ బాషా, హెడ్ కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, ఆంజనేయులు, కృష్ణమూర్తి, ప్రసాద్, పోలీస్ సిబ్బంది దాసరి రాజేష్, జోలదంకి రమేష్, అనిత అభినందనలు తెలిపారు.



దసరా ఉత్సవాల్లో కుక్కల వెంకటేశ్వరరావు

ముగిసిన దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

దసరా పండుగ సందర్భంగా దేవి శరన్నవరాత్రి మహెూత్సవాలు మంగళవారంతో ముగిశాయి. వాడ వాడలా కనకదుర్గ అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించారు. గ్రామంలోని దండి పార్వతి అమ్మవారి దేవస్థానంలో విగ్రహాన్ని గ్రామం మొత్తం రెండు రోజులపాటు ఊరేగించారు. వెల్లటూరు చానల్లో తెప్పోత్సవం నిర్వహించారు. టిడిపి నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, తనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తొమ్మిది రోజులపాటు ఉత్సవాల నిర్వహించిన విగ్రహాలను వెల్లటూరు కెనాల్‌లో నిమగ్నం చేశారు.



టిడిపి కార్యకర్తలను పరామర్శిస్తున్న నక్క ఆనందబాబు

ఆనందబాబు విస్తృత పర్యటన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నియోజకవర్గంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మంగళవారం విస్తృతంగా పర్యటించారు. కార్యకర్తల ఉద్దేశించి మాట్లాడారు. మండలంలోని పెద్దపులివర్రు పంచాయతీలోని కోళ్లపాలెం గ్రామానికి చెందిన ఆర్టిఎస్ కో ఆర్డినేటర్ గద్దె యతీష్ తండ్రి మాణిక్యరావు అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటుండగా పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలపై సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన సలహాలు సూచనలు అందించారు. అమర్తలూరు మండలం ఎడమూరు గ్రామానికి చెందిన బొంత మురళీకృష్ణ నూతనంగా నిర్మించిన పద్మావతి ట్రేడర్స్ గోడౌన్ ప్రారంభించారు. అనంతరం టిడిపి కార్యకర్తలతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. టిడిపి, జనసేన ఆధ్వర్యంలో సైకో జగన్ను ఇంటికి పంపించే సమయం వచ్చిందని అన్నారు. జగనోమహన్‌రెడ్డి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. చంద్రబాబు అరెస్టుపై ప్రజలకు వివరించాలని చెప్పారు. అవినీతి లేని కేసులో కక్షసాధింపుతోనే అరెస్టు చేశారని అన్నారు. సైకో ప్రభుత్వాన్ని దించేందుకు ప్రజలందరూ ముందుకు రావాలని కోరారు.

జెవివి ఆధ్వర్యంలో మేధాశక్తి

ప్రజాశక్తి - అద్దంకి

జెవివి ఆధ్వర్యంలో దసరా సెలవులు సందర్భంగా బాల, బాలికలకు మేధాశక్తి కార్యక్రమం నిర్వహించారు. బాలబాలికల్లో స్టేజి ఫియర్ నెస్ తొలగించుకునేందుకు, సూక్తులతో వాళ్ళ లక్ష్యాలను నిర్దేశించుకొని ఆత్మస్థైర్యంతో ముందుకెళ్ళేందుకు మంచి సూక్తులను వారితో బైహర్ట్ చేయించారు. కాకానిపాలెం జ్ఞాన వేదిక (వేప, రావి అరుగు) వద్ద విద్యార్థులకు కార్యక్రమం నిర్వహించారు. హెూలీ ఫేత్ స్కూల్ 2వ తరగతి విద్యార్థిని గొట్టిపాటి హిమశ్రీ మంచి సంకల్పంతో పనిని ప్రారంభిస్తే విజయం సాధిస్తామని యాక్షన్‌తో క్యాప్షన్‌తో ఒకే ఒక్క రోజు బ్రతికే పూలే విరబూసి నవ్వుతూ ఉంటే నూరేళ్ల బ్రతికే మనం చిరునవ్వుతో బ్రతకలేమా అని విద్యార్థులు చెప్పే క్యాప్షన్‌కు అందరూ చప్పట్లు కొట్టారు. ఈ విధంగా ఒక్కొక్కరు ఒక క్యాప్షన్ చదివారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ విద్యతోపాటు సామాజిక అంశాలపై అవగాహన ఉన్నప్పుడే విద్యార్థినీ, విద్యార్థులు



జెవివి మేధాశక్తి కార్యక్రమంలో కథలు చెబుతున్న చిన్నారులు

అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరని అన్నారు. జెవివి జిల్లా కార్యదర్శి తంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సెల్ఫోన్, టీవీ, కంప్యూటర్స్, ట్యాబ్స్ విపరీత వాడకం వల్ల జ్ఞాపకశక్తి తగ్గిపోతున్న విషయం విద్యార్థుల్లో గమనంప చేస్తూ అవకాశం ఉన్నంత వరకు పుస్తక పఠనంతో వాటిని దూరం చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ చదలవాడ గృహలక్ష్మి, గొట్టిపాటి శ్రీలక్ష్మి, ఆర్ విష్ణువర్ధన్‌రెడ్డి, చదలవాడ శృతిలయ, ఎస్ భార్గవిరెడ్డి, గొట్టిపాటి హిమశ్రీ,, త్రిపురనేని జాహ్నవి, డి రితిక, ఎం సిరిసాయి, కె యశశ్రీ, ఆర్ నిశికాంత్ కుమార్, జి రమేష్ పాల్గొన్నారు.



పర్యాటకులతో కళకళలాడుతున్న సూర్యలంక తీరం

సూర్యలంక తీరంలో సందడి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

దసరా సెలవులు ముగింపు దశకు రావడంతో సూర్యలంక తీరాన పర్యాటకులు పోటెత్తారు. దసరా సెలవులు ముగింపు రోజు కావడంతో పర్యాటకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పర్యాటకులతో తీరంలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్రం నలుమూలల నుండి ఇక్కడకు పర్యాటకులు వచ్చారు. గుంటూరు, కృష్ణ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చారు. హైదరాబాద్ నుండి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వరి కోసం తీరంలో రిసార్టులు అందుబాటులో ఉన్నాయి. మెరైన్, బాపట్ల రూరల్ పోలీసులు తీరంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ముందు జాగ్రత్తగా గజ ఈత గాళ్ళను సిద్దంగా ఉంచారు. తీరంలో పోలీసులు టవర్ ఏర్పాటు చేసి వాచ్ చేశారు. మైకుల ద్వారా హెచ్చరికలు చేస్తూ రక్షణ చర్యలు చేపట్టారు. పర్యాటకుల కోసం తీరంలో గుర్రపు స్వారీ, బీచ్ బైక్‌లు ఇక్కడ ప్రత్యేకంగా ఉన్నాయి. యువత, చిన్నారులు గుర్రపు స్వారీ చేస్తూ ఆనందించారు. యూత్ బైక్ అద్దెకు తీసుకొని షికారు కొడతారు. ఫోటో గ్రాఫర్లు పర్యాటకుల అనుభవాలను ఫోటోల్లో బందించారు. ప్రభుత్వ పర్యాటక శాఖతోపాటు ప్రైవేటు రిసార్టులు ఉన్నాయి. ముత్తయిపాలెం, అడవి పంచాయతీ పరిధిలోను రిసార్ట్స్ ఉన్నాయి. పర్యాటకులు నిత్యం వేల సంఖ్యలో ఇక్కడ రావటంతో హెూటల్లు వెలిశాయి.

ఓపెన్ స్కూల్‌కు 31వరకు గడువు

ప్రజాశక్తి - బాపట్ల

ఎపి సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్లో) 2023 – 24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిఇఒ పివిజె రామారావు తెలిపారు. అభ్యర్థులు www.apopen-school.ap. gov.inలో నమోదు చేసుకుని దగ్గర్లోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లో ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించి ఫీజు చెల్లించి ప్రవేశం పొందవచ్చని అన్నారు. 10వ తరగతిలో ప్రవేశానికి 2023 ఆగష్టు 31నాటికి 14ఏళ్ళ వయసు నిండి ఉండాలని తెలిపారు.



గ్రామంలో ప్రమాదకరంగా కుక్కల గుంపు

కుక్కల నియంత్రణపై చర్యలేవీ?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గ్రామంలో కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పదుల సంఖ్యలో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కుక్కలను పంచాయతీ అధికారులు పట్టించి గ్రామానికి దూరంగా విడిచి పెట్టేవారు. కుక్కలతో పొంచి ఉన్న ప్రమాదాన్ని పలువురు గ్రామస్తులు సర్పంచి దృష్టికి తీసుకెళ్లగా దానిపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణ వస్తున్నాయి.



టిడిపి కార్యకర్త ఖాదర్‌కు నివాళి అర్పిస్తున్న ఆనందబాబు

ఖాదర్‌కి టిడిపి అండగా ఉంటుంది

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

టిడిపి మైనార్టీ సెల్ నాయకులు షేక్ ఖాదర్ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు భరోసా ఇచ్చారు. వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన నియోజకవర్గ మైనార్టీ సెల్ నాయకులు మహమ్మద్ అనీఫ్ బాబాయి అయిన షేక్ ఖాదర్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపిని నమ్ముకుని పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని అన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి అండగా ఉంటామన్నారు.



పంటను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

పంటలను కాపాడండి

- సాగరు నుంచి 2 టిఎంసిలు విడుదల చేయాలి

- పంటలను పరిశీలించిన రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

రైతాంగం వేసిన పంటలను కాపాడాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఒమ్మెవరం, కండ్లగుంట, నాగులుప్పలపాడు తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన మిర్చి, మినుము, పొగాకు పంటలను పరిశీలించారు. జూన్‌లో పడిన వర్షాలకు రైతాంగం మిర్చి, మినుము, పొగాకు తదితర పంటలు సాగు చేశారని ప్రస్తుతం ఆ పంటలు ఎండుముఖం పట్టాయని, అక్టోబరు నెల ముగుస్తున్న నేపథ్యంలో సరైన వర్షం పడక పంటలు ఎండుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని రైతుసంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జె జయంతిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌కె మాబు మాట్లాడుతూ మండలంలో వాణిజ్య పంటైన మిర్చిని సుమారు 5వేల ఎకరాల్లో సాగు చేశారన్నారు. ఈపాటికే కౌలుతో కలిపి ఎకరానికి రూ.80 వేల దాకా పెట్టుబడి పెట్టారన్నారు. వర్షం పడక గుండ్లకమ్మ నుంచి నీరురాక పంటలు ఎండిపోతున్నాయన్నారు. కొంతమంది రైతాంగం బోర్లు, కుంటల నుంచి కిమీల కొద్దీ పైపులైన్ల ద్వారా ఎంతో వ్యయప్రయాసలకోర్చి నీటితడికి ఎకరానికి మరో 25వేల దాకా ఖర్చు చేస్తున్నారు. ఒమ్మెవరంలో ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి పోసి పంటలను కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. అయినప్పటికీ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో నీరు ఆవిరైపోతోందని అన్నారు. దీంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోందని అన్నారు. గుండ్లకమ్మ గేట్లు దెబ్బతిని 16 నెలలు అయినా మరమ్మతులకు నోచుకోక నీటిని విడుదల చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. గత ఏడాది ఈపాటికే నీటిని విడుదల చేశారన్నారు. గుండ్లకమ్మ గేట్ల మరమ్మతులు పూడిక తొలగింపుకు నిధులు వచ్చాయని చెబుతున్నారే కాని ఆచరణలో ఏమాత్రం కనిపించలేదన్నారు. దాంతో ప్రాజెక్టులోకి వచ్చిన నీరుంతా సముద్రం పాలవుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో సాగర్ కాలువ నుంచి 2 టిఎంసిల నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలన్నారు. మైనర్ ఇరిగేషన్ కింద మాగాణి భూముల్లో నాట్లు వేయని పరిస్థితి నెలకొందన్నారు. తద్వారా పశువులకు కూడా పశుగ్రాసం కొరతతోపాటు నీటి సమస్య తలెత్తే ప్రమాదముందని అన్నారు. అదేవిధంగా గుండ్లకమ్మ నుంచి నీరు వస్తుందని ఆశతో వర్షాలకు వచ్చిన నీటి ఆధారంగా మాగాణి నాట్లు వేశారు. ప్రస్తుతం వర్షాలు చాటేయడం కాలువ నీరు రాక ఎండతీవ్రతకు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో తదితర సమస్యల సంబంధించి సాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతూ వ్యవసాయశాఖ, ఇరిగేషన్ శాఖ మంత్రులను రైతు సంఘాల ఆధ్వర్యంలో కలవనున్నట్లు తెలిపారు. అదే విధంగా జిల్లా మంత్రి, స్థానిక శాసనసభ్యులు సాగర్ నుంచి 2టిఎంసి లనీటిని తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. లేనిచో రైతాంగాన్ని సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి జి బసవపున్నయ్య, కౌలు రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి శ్రీకాంత్, రైతులు యోనా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 50 లక్షల నగదుతో అలంకారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ధనలక్ష్మి అలంకరణ లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రూ.50 లక్షలు కరెన్సీ నోట్లతో అమ్మవారిని అందంగా అలంకరించారు. భక్తు లు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నయా దోపిడీ..!! బండి ఒకరిది.. భత్యం మరొకరిది..!!

- తోపుడు బండ్ల వ్యాపారులకు తప్పని తిప్పలు
- ప్రత్యేక విక్రయ కేంద్రాలు లేక అవస్థలు
- ఇళ్ల ఎదుట పెట్టుకున్నా తప్పని వేధింపులు
- స్థలం చూపాలని అధికారులను వేడుకోళ్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలంలో బండి పెట్టినా వెనుక ఉన్న ఇంటి యజమాని ఊరుకోడు. తనకు కప్పం కడితే తప్ప వ్యాపారం జరగనివ్వడు. రోడ్డు మీద రోజువారి వ్యాపారం చేయాలంటే భవన యజమానికి రోజువారీ చెల్లింపులు ఉండాల్సిందే. బండ్ల మీద అమ్మకాలు చేసే వారికి ప్రత్యేక స్థలం చూపాలని చిరు వ్యాపారులు కోరుతున్నా ఆచరణలో వారి కోరిక నెరవేరడం లేదు. రోజంతా పడిన కష్టం మామూళ్ల చెల్లింపులకే సరిపోతుందనే నిర్వేదం చిరు వ్యాపారుల్లో నెలకొని ఉంది

ప్రధాన రహదారిపై..

యర్రగొండపాలెంలోని ప్రధాన రహదారికి (ఎన్‌హెచ్ 565) ఇరువైపులా ఖాళీ స్థలం ఉంది. రోడ్డు పొడవునా ఉన్న ఈ స్థలంలో తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకొని పండ్లు, ఇతర చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇలా దాదాపు 300 మంది దాకా ఉన్నారు. ఇరువైపులా ప్రధాన డ్రైనేజీ వరకు ఉన్న స్థలమంతా ప్రభుత్వానిదే. డ్రైనేజీని ఆనుకుని ఉన్న భవనాల యజమానులకు ఇసుమంతైనా సంబంధం లేదు. కానీ ఈ ఖాళీ ప్రదేశంలో బండ్లు ఏర్పాటు చేసుకునేవారు భవన యజమానులకు రోజువారీ అద్దె చెల్లించాల్సిందే. నా భవనం ఎదుట బండి ఏర్పాటు చేసుకున్నావు. అందుకని తప్పకుండా అద్దె చెల్లించాల్సిందేంటూ జులుం ప్రదర్శిస్తున్నారు. సొమ్మకరిది..సోకు ఒకరిది అన్న చందంగా బడుగు జీవుల శ్రమను నిలువు దోపిడి చేస్తున్నారు.

పట్టించుకోని పంచాయతీ అధికారులు..

ప్రభుత్వ స్థలం కాబట్టి చదరపు మీటరు లేదా తోపుడు బండి, బంకు విస్తీర్ణాన్ని బట్టి నిర్ణీత ధర నిర్ణయించి వేలం వేసే అధికారం పంచాయితీలకు ఉంది. పట్టణ ప్రాంతాల్లోని పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారు. రోజుకు ఒక్కో బండికి ఐదు రూపాయలు చొప్పున కనిష్ట రుసుం తీసుకుంటున్నారు. ఇలా యర్రగొండపాలెం పట్టణంలో తోపుడు బండ్లకు వేలం నిర్వహించి, సంఖ్యల వారీగా స్థలం కేటాయింపులు చేస్తే అదనపు ఆదాయం సమకూరుతుంది. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టడంలో పాలకులు విఫలమయ్యారు. ఆదాయ వనరుకు గండి కొడుతున్నారు. రోడ్డు పక్కనున్న భవన



మెయిన్ రోడ్డులో ఉన్న తోపుడు బండ్లు

యజమానులందరూ బడాబాబులే. వీటివల్ల నెలకు కనీస రూ. ఐదారు వేలు, రద్దీగా ఉన్న కూడళ్లలో రూ. 20 వేలు వరకు అదనపు ఆదాయం వస్తోంది. ఇదంతా ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్నందుకే. పంచాయితీ వేలం నిర్వహిస్తే ఈ ఆదాయానికి గండిపడుతున్న ఉద్దేశంతో వేలం ప్రక్రియ జరక్కుండా రాజకీయంగా చక్రం తిప్పుతున్నారు. దీంతో పంచాయితీ ఏటా రూ. లక్షల్లో ఆదాయం కోల్పోతోంది.

దోపిడి జరుగుతున్న తీరు ఇలా..

తోపుడు, అల్పాహార బండ్లకు వేలం నిర్వహిస్తే పంచాయితీకి ఏడాదికి అక్షరాల రూ. 5.4 లక్షల ఆదాయం సమకూరుతుంది. గతంలో పంచాయితీ అధికారులు గుర్తించిన మొత్తం తోపుడు బండ్లు సుమారు 250. నెలకు ఒక్కో బండి నుంచి భవన యజమానులు వసూలు చేసేది రూ. 1500. ఈ లెక్కన అన్ని బండ్లకు నెలకు రూ. 3.75 లక్షలు. ఏడాదికి అక్షరాల రూ. 45 లక్షలు. అదే పంచాయితీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించి నెలకు రూ. 150 చొప్పున వసూలు చేసినా ఏడాదికి రూ. 4.5 లక్షలు ఆదాయం సమకూరుతుంది. దీని వల్ల చిరు వ్యాపారులకు ఊరట లభిస్తోంది. ఏళ్ల తరబడి ఈ దందా బహాటంగానే కొనసాగుతున్నా చర్యలు శూన్యం. అల్పాహారం బండ్లు సుమారు 50. ప్రైవేటు వ్యక్తులకు నెలకు చెల్లిస్తోంది. కనీసం రూ. మూడు వేలు. ఏడాదికి రూ. 18 లక్షలు. పంచాయితీ వేలం నిర్వహిస్తే ఏడాదికి వచ్చే ఆదాయం రూ. 90 వేలు. అయినా ఆ దిశగా పంచాయితీ దృష్టి సారించడం లేదు.

తోపుడు బండ్లకు స్థలాలు చూపించాలి



తోపుడు బండ్ల ద్వారా వ్యాపారాలు చేసే వారందరికీ బండ్లు నిలుపుకునేందుకు స్థలం లేకపోవడంతో అనధికారికంగా అధిక అద్దెలు చెల్లిస్తూ వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రోజంతా సంపాదించింది అద్దెలకే సరిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తోపుడు బండ్ల ద్వారా చిరు వ్యాపారులు చేసుకునే వారందరికీ వాటిని నిలుపుకొని వ్యాపారం చేసుకునేందుకు స్థలం కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టంగుటూరి సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి, యర్రగొండపాలెం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



వేలం వేస్తే పంచాయితీకి ఆదాయం వచ్చే మాట వాస్తవమే. దాదాపు 300 బండ్లు ఉన్నట్లు సర్వేలో గుర్తించాం. వీటికి వేలం ప్రక్రియ చేపట్టే విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాను. దీని ద్వారా ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉంది. త్వరలోనే దీనిపై కార్యచరణ రూపొందించి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

ఈదుల రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, యర్రగొండపాలెం

బండిపై అరటి పండ్ల వ్యాపారి ఆవేదన

కుటుంబ పోషణ కోసం ఇడ్లీ బండి పెట్టుకున్నా. బండి పెట్టుకుంటున్న స్థలం వెనక భవన యజమానికి రోజుకు రూ.100 ఇవ్వాలి. చేసేదిలేక ఇస్తున్నాం. నెలకు రూ.3 వేలు కట్టాలి. కరెంటుకు బుడ్డికి మరో రూ.300 ముట్టజెప్పాలి. ఇంతకన్నా వేరే మార్గంలేదు. పంచాయతీ నుంచి స్థలాలు కేటాయించి వేలం నిర్వహిస్తే మా కష్టం మాకు దక్కుతుంది. అయినా ఎవ్వరూ పట్టించుకునేవారే లేరు.

ఇడ్లీ బండి వ్యాపారి ఆక్రందన

పట్టణాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచేది పంచాయతీనే. ఇక్కడ జరుగుతున్న అమ్మకాలపై మాత్రం ప్రైవేటు వ్యక్తుల పెత్తనం పెరగడం చిరు వ్యాపారులకు భారంగా మారుతోంది. పంచాయతీ ఆ స్థలాల మీద అజమాయిషీ చేయాల్సి ఉన్నా పంచాయితీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో చిరు వ్యాపారులకు తిప్పలు తప్పడం లేదు. ప్రైవేటు వ్యక్తులకు కట్టే మొత్తం పంచాయితీకే చెల్లిస్తామని చెబుతున్నా పంచాయితీ నుంచి సహకారం లేకపోవడంతో చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

వ్యవసాయ రంగంలో... పెరుగుతున్న విద్యుత్ వాడకం.!

- 220 కెవి సబ్ స్టేషన్‌లో... పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌పై అదనపు భారం
- అదనపు లోడు తగ్గించేందుకు పవర్ కట్.!
- పవర్ ట్రాన్స్‌ఫార్మర్... సామర్థ్యం పెంచాలంటున్న అధికారులు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ప్రాంతంలో వ్యవసాయ రంగం పూర్తిగా విద్యుత్‌పై ఆధారపడింది. సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో వ్యవసాయ గొట్టపు బావుల్లో నీటిని తోడేందుకు విద్యుత్ మోటార్ల సాయంతో రైతన్నలు పంటలు పండిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిఏటా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు పెరుగుతున్నాయి. పెరిగిన కనెక్షన్‌లకు తగిన విధంగా మార్కాపురం సమీపంలోని దరిమడుగు వద్దగల 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెరగలేదు. దీంతో అధిక లోడుతో పెద్ద సమస్యగా మారింది.

అధిక లోడుతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. అధిక లోడు భారాన్ని తగ్గించేందుకు 220 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని 133/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లలో ఒక్కో సబ్ స్టేషన్‌లో ఒక్కో సమయంలో సుమారు రెండు లేదా మూడు గంటల పాటు కరెంటు కోత విధించక తప్పడం లేదు. దీంతో రైతన్నలు విద్యుత్ కోతల కారణంగా అరకొరగా బోర్లలో వస్తున్న నీటితో పంటలను తడపలేక ఎండబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



220కెవి విద్యుత్ సబ్ స్టేషన్

మార్కాపురం సమీపంలోని దరిమడుగు గ్రామం వద్దగల 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ప్రస్తుతం 62 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే ఉంది. ఇది కూడా సబ్ స్టేషన్ ప్రారంభ సమయంలో ఏర్పాటు చేసినదే. వాస్తవంగా దీన్ని ఈపాటికే ఖండం చేయాల్సి ఉంది. ఇక్కడి 220 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని పెద్దారవీడు, మార్కాపురం మండలాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లన్నీ ఉన్నాయి. పెద్దదోర్నాల మండలంలోని రామచంద్రకోట విద్యుత్ సబ్ స్టేషన్‌తో పాటు తర్లుపాడు మండలంలోని మరికొన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌లకు దరిమడుగు సమీపంలోని 220 కెవి సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా కావాల్సి ఉంది. మార్కాపురం మండలంలో 5200, పెద్దారవీడు మండలంలోని 2వేలు, పెద్దదోర్నాల, తర్లుపాడు మండలాల్లో 500 చొప్పున వ్యవసాయ కనెక్షన్‌లు ఉన్నాయి. ప్రస్తుత విద్యుత్ అవసరాల దృష్ట్యా ఇంకొన్ని 132/33 కెవి సబ్ స్టేషన్‌లు పెంచాలి. వాటితో పాటు 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ కూడా మరొకటి అవసరం. ప్రస్తుతం దరిమడుగు గ్రామ సమీపంలోని 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం 62 మెగావాట్లు కాగా... దాని స్థానంలో 100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేస్తేగానీ ప్రస్తుతం ఏర్పడిన అధిక లోడు సమస్య కొంతమేర గట్టెక్కే అవకాశం ఉంది. ప్రస్తుత పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన వపర్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ. 80 లక్షల వరకు వెచ్చించాల్సి ఉంది. విద్యుత్ శాఖ అంత మొత్తంలో డబ్బు ఖర్చు చేసేందుకు వెనుకాడటంతో రైతన్నలకు తరచూ విద్యుత్ కోతల సమస్య తలనొప్పిగా మారింది. వర్షాలు సక్రమంగా లేక... విద్యుత్‌లోనూ అంతరాయం కలుగుతుంటే పంటలపై పెట్టిన పెట్టుబడులు ఎలా వస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కాపురం ప్రాంత రైతన్నల తీరని కష్టాలను విద్యుత్ శాఖ పట్టించుకోవాలని, 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 100 మెగావాట్లకు పెంచాలని రైతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు.